# దొంగ-పోలీస్

-పాలగుమ్మి రామకృష్ణారావు

"**కా**లనీ ప్రెసిడెంట్ మీకోసం రెండుసార్లు ఫోన్ చేశారు." ఈ వార్తతో ఎదురొచ్చింది రమ్య రాత్రి పది గంటలకు వీధి గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్ట గానే.

"ఎందుకు?" చిరాగ్గా అన్నాడు బూట్లు విప్పుతూ. నా మాట విసురుకు రమ్య కొంచెం భయపడింది. సాక్సు వేసిన తరువాత పాదాల మీదకు వీచిన చల్లని గాలికి ఒక్కసారి నరకం నుంచి స్వర్గంలోకి వచ్చినట్ల యింది. రమ్య మొహంలోకి చూశాను, చిరాకును కాస్త తగ్గించి. ఆమె జవాబివ్వలేదు. నాకేసింకా భయంగానే చూస్తోంది. ఆఫీసులో ఆడిట్‌వర్కుతో ప్రాణం పోతోంది. మధ్యాహ్నం లంచ్ ఏం చేస్తున్నానో తెలియకుండానే నాలుగు మెతుకులు నోట్లో కూరుకోవలసి వస్తోంది. ఈ చికాకుకు కారణం పన్నెండు గంటల డ్యూటీ. ఆదివారాలు కూడా ఆఫీసును దర్శించుకోవాలి.

నా బాధల్ని పక్కనపెట్టి, ఇంకొంచెం సౌమ్యంగా అడిగాను- "మళ్లీ ఫోన్ చేస్తానన్నారా?"

"ఆ- చేస్తానన్నారు. రాత్రికి నైట్ డ్యూటీ ఉందని జ్ఞాపకం చెయ్యమన్నారు." ఈ మాటకు కాళ్ళు పూర్తిగా చల్లబడ్డాయి. కుర్చీలో వెనక్కు వాలాను.

"హతవిధీ. కొరివితో తల గోక్కున్నట్లుగా ఇదొ కటి."

రమ్య నా బాధను గ్రహించి "మీకు ఒంట్లో బాగుం డలేదని చెప్పేస్తాను" అంది.

కొన్ని క్షణాల మౌనం తరువాత అన్నాను- "బాగుం దదులే. నెలకు రెండు రోజులేగా- చూద్దాం" లేచి బాత్‌రూం వైపు నడిచాను. ధారగా వచ్చే నీళ్ళను చూస్తే మనసు ఆనందంతో పొంగింది.

వేదాంతంలో చెప్పే మాటొకటుంది. 'సుఖం అన్నది రెండు కష్టాల మధ్య విరామం'. ఈ కాలనీలో ఎన్నో కష్టాలకోర్చి సాధించుకున్న విజయాలు ఇలాంటి ఆనందాన్నే ఇస్తున్నాయి.

ఎవరో బిల్డరు సిటీకి ఇరవై కిలోమీటర్ల దూరంలో యాభై ఎకరాల స్థలాన్ని ప్లాట్లు చేసి ఇళ్ళుకట్టి అమ్మే పథకాన్ని పెడితే, ఆఫీస్ స్టాఫ్ మూకుమ్మడిగా బుక్ చేశారు. నేను కూడా వాళ్ళతో బాటు ఒక ప్లాటుకు టిక్కు పెట్టాను. బ్యాంకు లోను కూడా బిల్డరే ఏర్పాటు చేశాడు. కొత్త ప్రదేశం అయినా ఆఫీసు స్టాఫ్ అంతా తోడుగా ఉంటారనిపించి తీసుకున్నాను.

ప్లాట్లు స్వాధీనంలోకి తెచ్చుకున్నాక మా పాట్లు మొదలయ్యాయి. డ్రయినేజి సిస్టమ్ లేదు. మంచినీటి సరఫరా లేదు. భూమిలో నీళ్ళు తాగడానికి పనికిరావు. కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ లేక గుడ్డి దీపాలతో రాత్రులు గడిపేవాళ్ళం. పక్కా రోడ్లు లేవు. వర్షం వస్తే అంతా బురద. పిల్లలకు స్కూళ్ళు దూరం. సిటీ బస్సులు రోజు కు రెండు ట్రిప్పుల కన్నా లేవు. ఇలా చెప్పుకుంటూ పోతే మా కష్టాలు అనంతం. కాలనీవాసులం అంతా ఏకం అయ్యాం. అసోసియేషన్ స్థాపించాం. పంచా యతీ ప్రెసిడెంట్ నుంచి కానిస్టిట్యూషన్ ఎంపీ వరకు అందరికీ అర్జీలు పెట్టుకుంటూ మా వాటా డబ్బులు కట్టుకుంటూ, ప్రభుత్వం వాటా సంపాదించి ఒక్కొక్క పని పూర్తిచేసుకుంటూ కాలనీకి ఒక రూపం తీసుకు రాగలిగాం. అందుకే మా కష్టానికి లభించిన ఫలాలు మాకు చాలా ఆనందాన్ని కలిగిస్తాయి.

కష్టం వెనుక సుఖం, సుఖం వెనుక కష్టంలా మాకు కష్టాలు తప్పడంలేదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన కష్టం దొంగతనాలు. సిటీకి దూరంగా, హైవేకు ప్రక్కగా ఉన్న మా కాలనీ దొంగతనాలకు అనుకూలం అయింది. పగలు అందరం ఆఫీసులకు వెళ్ళేవాళ్ళం. ఆడవాళ్ళు లేని ఇళ్ళకు తాళాలు తప్పవు. రాత్రిళ్ళు అందరం ఇళ్ళలో ఉన్నా, కాంపౌండ్ వాల్సు లేకపోవడం, వీధి లైట్లు లేకపోవడం, నిర్మానుష్యం మొదలైన కారణాల వల్ల దొంగతనాలు పెరిగాయి.

పంచాయతీని డిమాండ్ చేసి ట్యూబులైట్లు వేయిం చాం. ఎస్.పి. స్థాయి వరకు ప్రయత్నించి పోలీసు పెట్రోలింగ్ పెట్టించాం. అయినా దొంగతనాలు ఆగ లేదు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మా కాలనీలో ఒక మీటింగ్ కూడా పెట్టారు. ప్రెసిడెంట్, సెక్రటరీలతో పాటు పెద్ద రికం కలిగిన నలుగురైదుగురం మేం కూడా స్టేజీ ఎక్కాం.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సందేశం ఒక్కటే. పోలీసు పెట్రో లింగ్ ఒక్కటే సరిపోదు, కాలనీవాసులు కూడా గ్రూపు లుగా పెట్రోలింగ్ చెయ్యాలి. అందరం ఒక మాటమీద కొచ్చాం. ఉద్యోగస్తులకు ఇది కొంచెం కష్టమయిన

పనయినా తప్పదు. ఇది మన కాలనీ. అందరం కలిసి డ్యూటీలు పంచుకుంటే ఇంటికి నెలకు రెండు రోజులు డ్యూటీ పడింది. ఇదిగో ఆ డ్యూటీకే ఈ రోజు రాత్రి రావాలన్నది.

స్నానం ముగించుకుని తొందరగా భోజనం పూర్తి చేసి కాసేపు విశ్రాంతి తీసుకుందామని నడుం వాల్చాను. మరో గంటకే వీధి తలుపులు ధన ధన మోగాయి. శీతాకాలం. మంచం మీద నుంచి లేవబుద్ధి కావడంలేదు. అయినా తప్పదు. బలవంతాన కళ్ళు తెరిచి స్వెట్టర్, మంకీ టోపీ వేసుకుని బయలుదేరాను.

"గుర్నాథం గారూ మీ టార్చి తెచ్చుకోవాలి" గేటు బయట నుంచి శంకరం మాష్టారు గట్టిగా చెప్పారు. రమ్య వచ్చి టార్చి అందించింది.

"ఇదిగో మీ విజిల్" జంగయ్య ఇచ్చాడు. తలుపేసు కొమ్మని రమ్యను హెచ్చరించి బాచ్‌తో కదిలాను.

"ఏంటి ఇంత డల్‌గా ఉన్నారు?" అడిగారు జీవన్ రెడ్డి.

"రెండు రోజుల నుంచి ఆడిట్ నడుస్తోంది. ఖాళీ ఉండటం లేదు. అలసిపోయి బాగా నిద్రపోయాను. ఇదిగో మీరొస్తే బలవంతాన లేచాను."

జీవన్‌రెడ్డి ఇన్‌కంటాక్స్ ఆఫీసరు. జంగయ్య హైకోర్టులో గుమాస్తా. శంకరం ఎలిమెంటరీ స్కూల్లో మాష్టారు. మా నలుగుర్ని ఒక బాచ్ చేశారు. రోడ్డు మీదకొచ్చాక శివాలయం దగ్గర కూర్చున్నాం.

"ఇప్పుడేం చెయ్యాలి?" అన్నాను చేతుల్ని స్వెట్టర్లో దోపుకుంటూ.

శంకరం మాష్టారు కొంచెం యాక్టివ్. ఆయనే చెప్పడం మొదలుపెట్టారు. "మొన్న మీటింగుకు మీరు రానట్టుంది గుర్నాథంగారూ?"

"లేదండీ. చెప్పానుగా- ఆఫీస్ పని వత్తిడి. ఆదివారాలు కూడా అటెండవుతున్నాం."

"సర్లెండి. ఇప్పటికి నాలుగు రోజుల నుంచి మన వాళ్ళు తిరుగుతున్నారు సార్. కార్యక్రమం ఏవిటంటే తెల్లవారు జామున నాలుగు గంటల వరకు మన డ్యూటీ. ఈ మధ్యలో మూడు రౌండ్లు తిరగాలి. పన్నెండు, రెండు, నాలుగు గంటలకు ఈ కర్రలతో ప్రతి ఇంటి గేటు కొట్టి, మనవాళ్ళను జాగ్రత్తగా ఉండేలా చెయ్యాలి. రౌండ్లు తిరిగేటప్పుడు విజిల్స్ కూడా వేస్తూండాలి."

"మన కాలనీ గూర్ఖా ఉండాలిగా! వాడేం చేస్తున్నాడు?"

"గూర్ఖా కూడా తిరుగుతాడు. మనకి, వాడికి మధ్య ఒక గంట తేడా ఉంటుంది. ఈ లెక్కన ప్రతి గంటకు కాపలా జరుగుతుంది. అంతేకాదు, మధ్యలో ఒకసారి పోలీసు పెట్రోలింగ్ కూడా వస్తుంది. వాళ్ళో రిజిష్టరు తెస్తారు. దాంట్లో వాళ్ళు వచ్చినట్లు మనమో సంతకం చెయ్యాలి."

"బాగుంది"

"అంతే కాదండి, మొదటి రెండు రౌండ్లకు టీ అరేంజ్ చేశాం. పన్నెండింటికి మా ఇంట్లో, రెండింటికి జంగయ్య ఇంటి దగ్గర."

"మరో రౌండుకి?"

"అవసరం లేదు సార్. ఆ రౌండ్ అయిపోయిన వెంటనే ఇంటికి వెళ్ళి నిద్రపోవచ్చు. ఇప్పుడు పదకొం దున్నర అయింది. మరో అరగంట ఇక్కడే కూర్చుని బయలుదేరొచ్చు" అన్నారు శంకరం మాష్టారు.

"నన్ను పన్నెండింటికి లేపితే బాగుండేదిగా?"

"సార్, మనం అందరం అలాగే అనుకుంటే పన్నెం డింటికి ఎవరం లేచి రాము. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకుంటే టైం నిముషాల్లో వెళ్ళిపోతుంది" జవాబిచ్చాడు జంగయ్య.

ఉద్యోగస్తులెవరికైనా ఇలా రాత్రి కాపలా కష్టమే. ఇది సమష్టి యజ్ఞంలా జరిగేది. నలుగురం కబుర్లలో పడ్డాం. ఇంటి విషయాలు, కాలనీ గొడవలు, ఎలక్షన్లు, రోడ్ల సమస్యలు.. మా మాటల్లో వరసగా దొర్లి పోయాయి. మామూలుగా క్షణం ఖాళీలేని మా జీవితాలకు ఇలా మనసు పెట్టుకుని మాట్లాడుకునే అవకాశం- ఒకరకమయిన ఆనందాన్ని కలిగించింది.

## జీవితం

ఇష్టాలను పెంచుకుంటూ
అయిష్టాలను వదుల్చుకుంటూ
కష్టాలను ఓర్చుకుంటూ / నష్టాలను పూడ్చుకుంటూ
సాగించేదే జీవితం
కష్టాలూ, నష్టాలూ కావు శాశ్వతం

## ఎప్పుడు..

ఎక్కడ చూసినా కాలుష్యం
అందరిలోనూ అలక్ష్యం / దేనిమీదా లేదు లక్ష్యం
ఎప్పుడొస్తుందో మరి సుభిక్షం

-వి. శ్రీలక్ష్మి

కాలనీ అంతా చీకటి మాటున నిద్రపోతుండగా మేం నలుగురం ఇలా కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడం చాలా థ్రిల్లింగ్ అనిపించింది. మా మధ్య నిద్ర ఎగిరి పోయింది.

పన్నెండవగానే నలుగురం బయలుదేరాం, విజిల్స్ వేసుకుంటూ, చేతి కర్రల్ని ఇంటి గేట్లకు కొడుతూ. మాకు తోడు వీధికుక్కలు భౌయ్ మని వెంటపడ్డాయి. సందడే సందడి. ఇళ్ళలోని వాళ్ళకు మెళుకువ రావడం ఖాయం అనిపించింది. శంకరం గారి ఇల్లు రాగానే హాల్లో కుర్చీల్లో బైఠాయించాం. ఆయన ఫ్లాస్కు నిండా టీ తీసుకొచ్చి కప్పుల్లో పోశారు. ఇంట్లో వాళ్ళు మాత్రం లేచి రాలేదు. టీవీ చూస్తూ టీ తాగాం. హెచ్.బి.ఓ.లో మంచి క్రైం చిత్రం వస్తోంది. వదలబుద్ధి కాలేదు. ఒక అరగంట చూసి డ్యూటీ ఫస్ట్ అన్నట్టుగా లేచాం. శంకరం గారు ఇంట్లో వాళ్ళను ఇబ్బంది పెట్టకుండా బయట తాళం వేశారు. ఒక గంట సేపటికి కాలనీ మొత్తం రౌండు పూర్తయింది. తిరిగి శివాలయం అరుగు మీదకు చేరాం.

"మా ఇంటికి పోయి సినిమా చూద్దామా?" అన్నారు శంకరంగారు. మనసు అటుకేసి లాగింది కానీ కాళ్ళుపీకి కదల్లేక కూర్చున్నాం. ఈసారి మా కబుర్లతో అనుబంధం పెరిగింది. కష్టసుఖాలు చెప్పుకున్నాం.

"మన బాచ్ ఎప్పుడు ఇలాగే ఉంచుకుందాం సార్. అసోసియేషన్ వాళ్ళు అడిగినా మారొద్దు" అన్నాడు జంగయ్య.

## సోపానాలు

కపాలంలో కాలీఫ్లవర్ వుండేవాడు
మొదటి మెట్టుపైనే
చతికిలపడిపోతాడు
మెదడులో మైదాపిండి నింపుకున్నవాడు
నాలుగు మెట్లెక్కి చల్లారి
నీలుక్కుపోతాడు
శిరస్సులో సహస్రారం విరబూసినవాడు
నిచ్చెనలో మిగిలిన నాలుగు మెట్లూ
నేనెక్కడానికే గదా వున్నాయ్
అనుకొంటాడు.

*-'నిశాపతి'*

రెండయ్యాక మరో రౌండుకు బయలుదేరబోతోంటే దూరంగా బొయ్ బొయ్ మంటూ పోలీసు వేన్ అరుపు వినిపించింది. పక్క వీధి నుంచి కాలనీ ప్రెసిడెంట్ సుందరయ్య వచ్చాడు.

"మీరిప్పుడొచ్చారేంటి?!" అన్నాను ఆశ్చర్యంగా.

"రోజూ రెండు గంటలకు అలారం పెట్టుకుంటాలెండి. ఇలా నైట్ డ్యూటీ చేసే మెంబర్లను కలుసుకుంటే మీకూ హాపీగా ఉంటుంది కదా. అంతే కాకుండా రోజూ ఈ టైంకు పోలీసు పెట్రోలింగ్ వాన్ కూడా వస్తుంది" అన్నాడు సుందరయ్య.

"రండి మా ఇంటికి వెళ్ళి టీ తాగుదాం" జంగయ్య లేచాడు.

"పోలీసు వేన్ వస్తోందిగా-"

"అది రావడానికి మరో అరగంట పడుతుంది. పదండి"

"వాళ్ళు అలా అలారం రంకె వేసుకుంటూ ఊరు వెంబడి తిరుగుతూంటే దొంగలు దాక్కుంటారు కదండీ?" నన్ను ఎప్పటినుండో వేధిస్తోన్న ప్రశ్న ఇప్పుడు బయటపెట్టాను.

జంగయ్య దానికి విచిత్రమయిన జవాబు చెప్పాడు. "వాళ్ళకు దొంగల్ని వేటాడే బాధ తప్పుతుంది. దొంగలు కూడా తక్కువవాళ్ళు కాదు. గొడ్డళ్ళతో తిరగబడ్డారంటే అవతల వాళ్ళ ప్రాణాలు పోతాయి. లోపాయికారీగా ఈ అలారం ఒక హెచ్చరిక. మీకు మాకూ యుద్ధం వద్దు, దయవుంచి ఇక్కడ్నించి వెళ్ళిపొండని."

జంగయ్య మాటలకు అందరం కడుపుబ్బ నవ్వుకున్నాం. మరికొంత సేపటికి పెట్రోలింగ్ వేన్ వచ్చింది. ఇద్దరు పోలీసులు కిందకు దిగి వాళ్ళ రిజిష్టరు అందించారు. మేం అందరం సంతకాలు చేసి మా ఫ్లాట్ నెంబర్లు కూడా రాశాం.

"వస్తాం సార్, జాగ్రత్త" అని వాళ్ళు హారన్ మోగించుకుంటూ వెళ్ళిపోయారు. కాలనీ కుక్కలు వేన్ కూడా కొంత దూరం పరిగెట్టి తిరిగొచ్చాయి. మా రెండవ రౌండ్ ప్రారంభంలో జంగయ్య ఇంటికి వెళ్ళి తేనీరు సేవించాం.

"నాకు టీ తాగాక బాగా నిద్రపడుతుందండి" అంటూ గుడ్‌బై చెప్పి ప్రెసిడెంట్ వెళ్ళిపోయాడు. మేం సిన్సియర్‌గా తలుపులు, గేట్లు కొట్టుకుంటూ, విజిల్స్ వేసుకుంటూ తిరుగుతున్నాం. ఆఖరి మలుపులో శంకరయ్య గారి ఇంటి దగ్గరకు వచ్చేసరికి మా కాళ్ళకు

బ్రేకులు పడ్డాయి. అందరం వణికిపోయాం. శంకరం గారి ఇంటి తాళం తీసుంది. ఇంతకు ముందు బయట తాళం వేసింది ఆయనే. అనుమానం లేదు, ఎవడో దొంగ దూరాడు. మాకేం చెయ్యాలో అర్థం కాలేదు. ధైర్యంచేసి లోపలకు వెడితే దొంగ ఏ బండతో బాదుతాడో, కత్తితో పొడుస్తాడో తెలీదు. శంకరం గారు తెగించి ఒక్క ఉదుటున తలుపులు బయట నుంచి వేసేసారు. దొంగ వెనుక నుంచి వెళ్ళే మార్గం లేదు. అటు లోపల తలుపు తాళం వేసే ఉంచుతారు.

నలుగురం విజిల్స్ గట్టిగా వేశాం. "దొంగ-దొంగ, చోర్-చోర్, తీఫ్-తీఫ్" అంటూ మూడు భాషల్లో అరిచాం. శంకరం గారి భార్య పిల్లలతో సహా పక్క ఇళ్ళ వాళ్ళు లేచి అరుపులు అందుకున్నారు. ఆ అరుపు అలా అలా అంచలంచలుగా కాలనీ అంతా పాకింది. ప్రెసిడెంట్, సెక్రటరీ, మెంబర్లు, గూర్ఖా... అంతా జనమయం అయింది. గూర్ఖా ధైర్యంగా తలుపు తీసి లోపలికి వెళ్ళాడు. మా ఊహ నిజమయింది. దొంగ నిజంగానే దూరాడు. వంటింట్లో దాగి ఒక్కసారిగా గూర్ఖా మీద తిరగబడ్డాడు.

ముళ్ళ కంచె లాంటి జైల్లోంచి ముళ్ళకంచె దేశం లోకి వెళ్ళి దొరికిపోయిన ఖైదీల సినిమాలా దొంగ బయట మా నుంచి తప్పించుకోలేకపోయాడు.

మా ఆఫీసులో టైపిస్టు రాంబాబు దొంగ జుట్టు గట్టిగా పట్టుకుని గోడకేసి బాదాడు. జంగయ్య వేగంగా వాడి మొహంమీద పిడిగుద్దులు గుద్దాడు. వాడి పెదాలు రక్తం వోడాయి. ముందు పళ్ళు రాలి పడ్డాయి. కన్ను వాచిపోయింది. జంగయ్య చేతికి ఇంత బలం ఉంటుం దని నేను ఊహించలేదు. మరో నలుగురు మా చేతి కర్రల్ని తీసుకుని ఇష్టం వచ్చినట్లు బాదారు. దొంగ బాగా తాగి ఉన్నాడు. వాడికి ఒళ్ళు తెలియడంలేదు. చివరకు వాణ్ని లైటు స్తంభానికి కట్టేశారు. పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేస్తే మరో అరగంటకు పెట్రోలింగ్ వాన్ వచ్చింది.

పోలీసులు దొంగను కాళ్ళు, చేతులు కట్టి ఒక మూలగా వేన్‌లో వెనుక పడేసి తీసుకుపోయారు. ఆ రోజు రాత్రి కాలనీవాసుల మధ్య దొంగ కబుర్లతో మాకు మూడవ రౌండు లేకుండానే ముగిసింది.

మా నైట్ డ్యూటీలో ఒక దొంగను పట్టుకున్నం దుకు చాలా గర్వంగా ఫీలయ్యాం. ప్రొద్దుటే ఎనిమి దింటికల్లా తయారై ప్రెసిడెంట్‌తో సహా మేం నలుగు రం పోలీసు స్టేషన్‌కు వెళ్ళాం. అప్పటికి ఎస్.ఐ. రాలేదు. మేం అందరం ఆఫీసుకు వెళ్ళవలసిన వాళ్ళం. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. జరిగిందంతా రిపోర్టు రాసివ్వాలి. ఓపిగ్గా కూర్చున్నాం.

పదింటికి ఎస్.ఐ. రాగానే అందరం నమస్కారం పెట్టాం. ఆయన కూడా నవ్వుతూ విష్ చేసి తన రూమ్ లోకి తీసుకువెళ్ళాడు. పోలీసులు దొంగను సెల్‌లోంచి తీసుకొచ్చారు. రాత్రి వాడి మొహం మాకెవ్వరికి సరిగ్గా కనపడలేదు. ఇప్పుడు చూస్తే మాకు చాలా భయం వేసింది. చాలా బలంగా ఉన్నాడు. వాడి చూపులు షోలే గబ్బర్‌సింగ్‌ను మించిపోయాయి. చీకట్లో అం దరూ తలో చెయ్యివేసి బాదేశారు కానీ పగలు చూస్తే ఆమడదూరం పరిగెత్తేవారే.

"ఏరా- కాలనీలో ఏం దొంగిలించావు?" ఎస్.ఐ. గదమాయించాడు.

"ఏం లేదు సారు. వచ్చిన వెంటనే పట్టుకున్నారు" అతి వినయంగా అన్నాడు వాడు. వాడు మాట్లాడు తోంటే నోరు ఎర్రటి పుండులా కనిపించింది. నాకు జాలేసింది. జంగయ్య మరీ అంత గట్టిగా కొట్టడం తప్పనిపించింది.

"రిపోర్టు ఇద్దామని వచ్చాం సార్" అన్నాను. వ్యవ హారాన్ని త్వరగా తేల్చుకుని అటునుంచి అటే ఆఫీసుకు వెళ్దామని.

టేబులుపై ఫోన్ మోగింది. ఎస్.ఐ. 'హలో' అన్నా డో లేదో ఒక్కసారి ఎలర్ట్ అయి "సార్- నమస్తే సార్" అన్నాడు.

"ఎప్పుడు సార్? పొద్దున్నా? ఎక్కడ? బ్రహ్మానంద రెడ్డి పార్కులోనా? ఇప్పుడే ఒక కేసొచ్చింది సార్..." అంటూ ఫోన్ పెట్టేశాడు.

"సార్ ఎఫ్.ఐ.ఆర్." ఈసారి జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. ఎస్.ఐ. రెండు నిముషాలు టేబులుపై పేపరు వెయిట్‌ను చేత్తో తిప్పుతూ మౌనంగా ఉండిపోయాడు.

జంగయ్య అడిగాడు "సీరియస్ కేసా సార్?"

"మాకిది మామూలే. మీరు వెళ్ళొచ్చు."

"ఎఫ్.ఐ.ఆర్. -"

ఎస్.ఐ.కు కోపం వచ్చింది. "మీకెందుకయ్యా అవన్నీ. వెళ్ళండి" అంటూ కసురుకున్నాడు.

నేను ఆడిట్ ఆఫీసర్ని. ఎస్.ఐ. నాకన్నా చిన్న ఉద్యోగే. అది ఆయన స్థానం అయితే కావచ్చు. రాత్రంతా నిద్రలేకుండా దొంగను పట్టి, అప్పగిస్తే ఇలా కసురుకోవడం నాకు బాధనిపించింది.

"చూడండి- రాత్రి మేం పడ్డ శ్రమ మీరు గమనిం

చడం లేదు" కాస్త గట్టిగానే అన్నాను.

ఎస్.ఐ. ఒకసారి నాకేసి తేరిపార చూసి, "మీరు వాడ్ని రాత్రి బాగా కొట్టారు. అవునా?" అన్నాడు.

"వాడు దొంగ కదా. మళ్ళీ పారిపోతాడేమోనని"

"మీ చేతికి దొరికాక ఎలా పారిపోతాడు? వాడి ముందు పళ్ళు రాలగొట్టారు. ఇప్పుడు మీరు కేసు బుక్‌చేస్తే అది మీమీదకే వస్తుంది. మీరు కోర్టు చుట్టూ తిరగడం, జరిమానాతో అయిపోదు. మీరు చేసిన నేరానికి జైలుశిక్ష కూడా పడొచ్చు. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకునే అధికారం మీకు లేదు." మెల్లమెల్లగా స్వరాన్ని పెంచాడు ఎస్.ఐ. మేం నాగస్వరం ముందు నాగుపాములా దిగిపోయాం.

"ఏం చేద్దామంటారు?" అన్నారు జీవన్‌రెడ్డి సంధికి వచ్చినట్లుగా.

"అదే చెబుతున్నాను. మీరు వెళ్ళిపోండి. ఆ దొంగ సంగతి మేం చూసుకుంటాం. వాడిని పనిష్మెంట్ లేకుండా వదలం, సరేనా. ఉద్యోగస్తులు మీరంతా. మీకు ఈ రిస్క్ వద్దు."

"థేంక్యూ సార్" అవమానాన్ని దిగమింగుకుని మా మొహాలకు నవ్వు పులుముకుని ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోయాం.

క్షమించండి. ఈ కథ ఇక్కడితో ఆపు చేస్తున్నాను.

❖ ❖ ❖

తరువాత నాకు తెలిసిన మరో కథ-

ఆ మంత్రి గారికి ఎన్ని రాజకీయ సమస్యలున్నా ఎప్పుడూ చిరునవ్వుతోనే ఉంటారు. మంచి ఆరోగ్యంతో, ఇస్త్రీ నలగని బట్టల్లో నవనవలాడుతుంటారు. ఆయన ఆరోగ్య రహస్యం గూర్చి ఇప్పటికీ పత్రికా విలేకరులు ప్రశ్నిస్తూ బాక్సు కట్టి ప్రచురిస్తుంటారు.

ప్రతిరోజూ ఉదయాన్నే బ్రహ్మానందరెడ్డి పార్కులో ఒక గంట నడక, వ్యాయామం చేస్తారు. అదే ఆయన ఆరోగ్య రహస్యం అట. ఈ రహస్యాన్ని మరోసారి విలేకరులు అడిగి తెలుసుకుంటున్నారు. టి.వి. కవరేజిలు కూడా ఉన్నాయి.

మంత్రిగారు చిద్విలాసంగా చెపుతూ ఆయన చెయ్యి లాల్చీ జేబు మీద వేసుకున్నారు. మొహంలో రంగులు మారాయి. విలేకరులు గతుక్కుమన్నారు.

"ఏవయింది సార్!?"

"ఎవడో నా పర్సు కొట్టేసాడు"

సెక్యూరిటీ గార్డులు తెల్లబోయారు. క్షణాల్లో రూం లాక్‌చేసి అందర్నీ చెక్‌చేశారు. దొరకలేదు.

సెక్యూరిటీ ఆఫీసర్ వినయంగా అడిగాడు "సార్ పర్సు ఇక్కడ పోయిందా-- అది కాదు సార్- ఇక్కడేనా- లేక..."

మంత్రిగారు విసుగ్గా అన్నారు. "ఏమో, పొద్దున్న పార్కులో పోవచ్చు. ఇందాకా బట్టల షాపు ఓపెన్ చేసినప్పుడు పోవచ్చు."

"కాష్ ఎంతుంటుందని చెప్పమంటారు సార్?" మంత్రిగారి పి.ఎ., ఐ.జీ.కి ఫోన్ చేస్తూ అడిగాడు.

"ఓ పదివేలు చెప్పు"

ఇన్ఫర్మేషన్ సెల్ టు సెల్ అన్ని పోలీసు స్టేషన్లకు క్షణాల్లో పాకింది.

పది నిముషాల్లో పి.ఎ. గారి ఫోన్ మోగి గోడకు కొట్టిన బంతిలా సమాధానం వచ్చింది.

"దొంగ దొరికాడు. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఉన్నాడు. డబ్బు పదిలం"

పి.ఎ. ఆనందంగా మంత్రిగారికి చెప్పాడు. మంత్రిగారి మొహం మామూలుగా వికసించింది. ఇంత త్వరగా దొంగను పట్టిన పోలీసులకు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఇస్తామని ప్రకటించేశారు. విలేకరులు అవాక్కవడం వల్ల మంత్రిగార్ని వేరే ప్రశ్నలు వెయ్యలేక పోయారు.

ఇప్పుడు టి.వి. కెమేరాలు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ వైపు పరిగెట్టాయి. మరో గంటలో దొంగ-పోలీసుల లైవ్ అన్ని టీవీల్లో కవరేజ్ అయింది. పాపం పత్రికలు మర్నాటి వరకు ఆగి "మంత్రిగారి జేబు కత్తిరింపు- పది నిముషాల్లోనే దొంగ జైలుకు తరలింపు" అంటూ సర్కారు ఘనతను పొగుడుతూ దొంగ ఫొటోను మొదటి పేజీలో ప్రచురించారు.

ఈ కథ ఇక్కడితో సుఖాంతం.

❖ ❖ ❖

కాకపోతే నా అనుమానం తీరలేదు. పేపర్లలోనూ, టీవీల్లోనూ చూపిన దొంగ, మేం మొన్న రాత్రి పట్టుకున్న వాడిలాగే ఉన్నాడు. ఇదెలా సాధ్యం!?

"గుర్నాథంగారు, మీదంతా చాదస్తం. మనం ఎన్ని సినిమాల్లో చూడడంలేదు? మనిషిని పోలిన మనుషులు ఇద్దరు, ముగ్గురూ ఇంకా ఎక్కువే ఉంటారు. మనం పట్టుకున్న దొంగ వేరు. అక్కడ దొంగ వేరు" అన్నాడు జంగయ్య.

ఆలోచిస్తే జంగయ్య చెప్పిందాంట్లో నిజం ఉందనిపించింది. ఇక్కడి దొంగ వేరు, అక్కడి దొంగ వేరు. ■